## పెద్ద కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

“ఆదివారంనాడు అరటి మొలిచెను... ” రవి చదూతుంటే రేఖ ఈజీఛెయిర్లో అశాంతిగా కదిలింది.

అవున్మరి! తనెపుడో చిన్నప్పుడు చదువుకున్న తెలుగు పద్యాలే కొడుకు ఇప్పుడు చదవడం అశాంతే కల్గిస్తుంది కదా!

చేతుల్లోవున్న 'వుమన్స్ ఈరా' మీదికి దృష్టి మళ్ళట్లేదు.

జాలిగా కొడుకువైపు చూసింది.

వాడు చక్కా చదువుకుపోతున్నాడు — యాక్షన్‌తో సహా.




ఆంధ్రభూమి



"ఛుక్... ఛుక్... రైలుబండి వస్తోంది " అరచేతిని నిలువుగా జాపి — బొటన వ్రేలూ, చూపుడు వ్రేలూ మధ్యగా నోరుంచి — శబ్దం చేసి మరీ చదువుతున్నాడు.

వాడంత శ్రద్ధగా చదువుతున్నా ఆమెకి దిగులేసింది.

"ట్వింకిల్ — ట్వింకిల్ లిటిల్ స్టార్—" అనో,

'బా.. బా... బ్లాక్ షీప్ — ' అనో ఎంచక్కా పై ఫ్లాట్‌లో వాళ్లబ్బాయిలా ఇంగ్లీష్ రైమ్స్ చదివితే ఎంత బావుణ్ణు!

ప్చ్! ఎలా చదువుతాడు?

వాడేమో ఇంగ్లీషు మీడియమ్ — వీడేమో తెలుగు మీడియమ్!

అలా అని ఆపై ఆవిడకి ఎంత గర్వమో!

'మా వాడికి తెలుగు రాదండీ బాబూ — ప్రతిదీ వాడికి ఇంగ్లీషులో చెప్పాల్సిందే — అయినా ముందు నాకొస్తే కదా వాడికి రావడానికి — ' దర్పంగా చెబ్తుంది.

ఈ మాటే తను ఆయన్తో చెప్పింది.

ఆయన నవ్వేసి — 'రేఖా! ఏదన్నా రాదూ అని చెప్పుకోటానికి సిగ్గుపడాలి — అందులోనూ మాతృభాష రాదని చెప్పుకోవాల్సి వస్తే అవమానంగా ఫీలవ్వాలి. అంతేగాని అందులో గర్వపడాల్సిందేమీలేదు — ' అన్నారు.

తన బాధ ఆయనకర్థం కాదు.

ఆయన 'సిద్ధాంతాలూ, అభిప్రాయాలూ ఆయనవే కానీ — ఒకళ్ళు చెబ్తే — అందులోనూ తను చెబ్తే వినే అలవాటస్సలేదు.

'మనకేం తక్కువండీ?'

బాబుని ఇంగ్లీష్ మీడియమ్ — చక్కటి కాన్వెంట్‌లో జాయిన్ చేద్దాం — ' అని ఎంత పోరుపెట్టిందీ తను? వింటేనా?

వూహూ! పోనీ ఆయనేమన్నా ఇంగ్లీషు విరోధా? అంటే కాదు. బ్రిటన్ వాళ్ళ యాక్సెంట్‌తో — అమెరికన్ యాక్సెంట్‌తో — అవసరమైతే ఫ్రెంచివాళ్ళ యాక్సెంట్‌తో కూడా ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడగలరు.

పైగా 'ఇంగ్లీష్ ఈజ్ విండోటు ద వరల్డ్ — ఐ రెస్పెక్ట్ ఇట్' అంటాడు ఎంతో అభిమానంగా.

ఇంకా మాటలు కూడా సరిగ్గా రాని పిల్లలు ఇంగ్లీష్ టకటక లాడించేస్తుంటే తన ప్రాణం పెరపెరలాడిపోతుంది.

తనంటే చిన్నప్పుడు అవకాశాల్లేక తెలుగు మీడియమ్‌లో చదవాల్సి వచ్చింది.

ఆత్మన్యూనతతో చచ్చిపోయి — లోపల్లో పల ఏడ్చుకుంటూ గ్రామర్ని కంఠతాపట్టి — చివరికెలాగో పట్టిపట్టి పోట్లాడుతూ — తెలుగు యాక్సెంట్‌తో అయినా ఇంగ్లీషు మాట్లాడ్డం నేర్చుకుంది.

కానీ బాబుకేం ఖర్మ? బాబుకున్న చక్కటి అవకాశాల్ని ఆయనే ఛాదస్తంతో పాడుచేస్తున్నారు.

ప్రపంచమంతా పోటీమయంగా మారి పోయి ముందుకు పరిగెత్తుతోంటే — ఈయన వీడ్ని వెనక్కి పరిగెత్తిస్తున్నారు—' వ్యక్తోషంగా అనుకుంది.

'వీడ్ని నాకొదిలేసెయ్ — జేమ్స్‌లా తయారు చేస్తాను. కంప్లీట్‌గా డిఫరెంట్‌గా

— నా అయిడియాలకి అనుగుణంగా — అయిడియల్‌గా — ఎక్స్‌పెరిమెంటల్‌గా పెంచుతాను.

నీకూ అలాటి ఇంట్రెస్టువుంటే నెక్స్ట్ ఇష్యూ ట్రయ్ చెయ్యి—' అన్నారు కన్నుగీటి

నెక్స్ట్ ఇష్యూ అనుకోగానే చేతుల్లో వున్న పుస్తకం గుండెలమీదికి — చేతులు ఎత్తుగా వున్న కడుపుమీదికీ — వెళ్ళిపోయాయ్ తీయటి తలపుల్తో!

'ఒక్కడు చాలండీ బాబూ — వీడ్ని సరిగ్గా పెంచితే మన జన్మ ధన్యమయినట్లే —' అని చెప్పింది మొదట్లో.

తనెంత వద్దన్నా అతను విన్లేదు.

'కంపెనీ లేకుండా పెరిగితే రవి ఇంట్రోవర్ట్ అవుతాడు. షేర్ చేసుకోకుండా పెరిగే పిల్లల్లో సెల్ఫిష్‌నెస్, భయంకరమైన పొస్సెస్సివ్‌నెస్ ఎక్కువయ్యే ప్రాబబిలిటీ వుంది.

కాబట్టి ఇంకొకళ్ళు కావాల్సిందే! అలాగని బలవంతమేంలేదు.

నీకు ఓపిక లేదంటే చెప్పు!

అవాధ్యాశయం మంచి తెచ్చుకుందాం — ర్యాదర్ అయ్ ప్రిఫర్ ఇట్! క్యాజువల్‌గా తేలిగ్గా చెప్పేసారు.

అన్నీ విపరీతమైన బుద్ధులే!

'అంతా నీ ఇష్టమే సుమా — ' అన్నట్టు చేస్తారు — చావుకి పెద్దే లంఘణాలకి ఒప్పుకోక ఏం చేస్తుందీ తను?

వంశమేమిటో — తల్లెవ్వరో — తండ్రెవ్వరో — పుట్టుకేమిటో తెలివి పిల్లాడ్ని తెచ్చుకుని జన్మంతా వాడికి ధారపోసే బదులు—

తన రక్తం పంచుకుని పుట్టిన వాడయితే వందరెట్లు నయం కదా! పైగా ఆయన మీద తనపంతం చెల్లించుకోవచ్చు!

"అమ్మా..." చదువుతోన్న రవి పిలిచాడు.

ఆమె పలకలేదు — కావాలనే!



తనకి 'మమ్మీ' అని పిలిపించుకోవాలని కోరిక!

'మమ్మీ' ఏమిటోయ్? నాకెందుకో ఆ మాట వింటే ఈజిప్షియన్ మమ్మీలు గుర్తొస్తాయ్ — ఎలర్జీగా వుంటుంది.

ముఖమంతా అయిష్టంగా పెట్టుకుని చెప్పారు. అంతేకాదు. బాబుకికూడా 'అమ్మా' అని పిలవటమే అలవాటు చేశారు.

వాడు మరీను! అబ్బ కొడుకే! అబ్బ ఎంత చెబ్తే అంత!

పుట్టబోయేవాడు మాత్రం తన కొడుకే అవుతాడు. మాడన్‌గా — అప్ టు డేట్‌గా — అచ్చంగా దొరబాబులా — పూర్తిగా తన వూహలకి అనుగుణంగా పెరుగుతాడు.

ఎంత మధురంగా — వుత్సాహంగా వూహించుకోబోయినా — ఎంతయినా తల్లి మనస్సు కదా... ఎదురుగా వున్న కొడుకు మీదే కాన్సంట్రేట్ అవుతోంది.

రవి మళ్ళీ పిలిచాడు — "అమ్మా—"

తల తిప్పి చూసింది.

"మహమ్మదీయుల పుణ్యక్షేత్రము మక్కా అని వుందిక్కడ. పుణ్యక్షేత్రమూ అంటే ఏమిటి?" అడిగాడు.

క్షణం ఆలోచించి చెప్పింది — "గుడి అన్నమాట".

తల విలువుగా వూపి అడిగాడు "మక్కా అంటే గుడి—"

"అవును" కన్ఫర్మ్ చేసింది.

వెంటనే ఏదో గుర్తొచ్చినట్టడిగాడు — "మరెందుకూ మనం ఎప్పుడూ వెళ్ళలేదు?"

దిక్కుమాలిన డౌట్లొస్తాయ్ పిడికన్నీ!

"మన గుడి వేరే — శనివారం వెళ్తాం చూడు — అదన్నమాట మన గుడి —" ఓపిగ్గా చెప్పింది.

వాడేదడిగినా — అలా ఓపిగ్గా, అర్థమయ్యేట్టుగా నిజం మాత్రమే చెప్పాలనీ—

వాడ్ని కన్‌ఫ్యూజ్ చేసేయాలన్న తాపత్రయంలో అబద్ధాలు చెప్పద్దనీ — మాయమాటలు చెప్పి మరిపించొద్దనీ — ఎట్టి పరిస్థితుల్లోను విసుక్కోవద్దనీ — హయ్యర్ అథార్టీస్‌నుంచి ఆర్డర్!

అలా అయితేనే వాడి క్యూరియాసిటీ పెరుగుతుందట!

అడ్డమైన పుస్తకాలూ చదివి — ఈయన కొత్త సిద్ధాంతాలు లేవదీసి తనమీద రుద్దుతున్నారు.

"మనం మక్కాకి వెళ్ళకూడదా?"

పిడిక అవదు! ప్రశ్నల్తో ప్రాణం తోడేస్తాడు.

ఒక ప్రశ్నకి జవాబు చెబ్తే ఆటోమేటిగ్గా ఇంకో ప్రశ్న పుట్టుకొచ్చేస్తుంది.

"తప్పు. మనం మన గుడికి వెళ్ళాలి. మహమ్మదీయులు మక్కాకి వెళ్ళాలి."

"ఎందుకట్లా?"

నెమ్మదిగా తట్టిందామెకు — ఏం చెప్పాలో.

"నువ్వు నీ స్కూల్‌కి వెళ్ళాలి కానీ — పై వాళ్ళబ్బాయ్ గోపి వాళ్ళ స్కూల్‌కి వెళ్ళకూడదు కదా! అట్లా అన్నమాట."

రవి కన్‌ఫ్యూజ్ అయినట్టు లేదు. ఇంకా ఏదో అనుమానం!

"పోనీ మనం కూడా వెళ్ళి — మనమే మహమ్మదీయులం అని చెబ్తే రానిస్తారా?"

చంపేసాడు! ఏమని చెప్పటం?

"రావివ్వరు — వాళ్ళకి తెల్సిపోతుంది."

"ఎట్లా తెల్సిపోతుంది?" వాడికర్థం కావట్లేదు.

వాడి స్కూల్లో ఎవరయినా మహమ్మదీయుల పిల్లలున్నారేమోనని ఆలోచించబోయి తనని తనే తిట్టుకుంది. —'ఏడ్చినట్టుంది. వీడు చదివేది తెలుగు మీడియమ్! అందులో వాళ్లెట్లా వుంటారు?'

మదురు కొట్టుకోబోతుండగా ఆమెకి ఆ ఆలోచనొచ్చింది.

"వాళ్ళమ్మా వాళ్ళు బొట్టు పెట్టుకోరు చూడగానే తెల్సిపోతుంది"

"మరి నువ్వు కూడా పెట్టుకోవుగా ఒక్కోసారి—"

రేఖకి నవ్వూ, కోపమూ రెండు వస్తున్నాయి.

"అప్పుడప్పుడు మర్చిపోతాను. వాళ్ళట్లాకాదు. అసలెపుడూ బొట్టు పెట్టుకోరు."

వాడి బుర్రలో వాడేదో కనెక్ట్ చేసుకుని అడిగాడు — "మరి వాళ్ళ నాన్నావాళ్ళు బొట్టుపెట్టుకుంటారా?"

రేఖకి ఈసారి నవ్వొచ్చింది.

తనెంత తప్పు పద్ధతిలో వాడ్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తోందో కూడా అర్థమయింది.

ఇక లాభం లేదనుకుని చెప్పింది — "మీ నాన్నొచ్చాక అడుగుదూ గానీ — వుండు."

"రైట్ — " వాడు పుస్తకాలు సర్దటం మొదలెట్టాడు.


హమ్మయ్య అనుకుందామె!

ఆయనకి అంట గట్టేస్తే కానీ తెల్సిరాదు — పిల్లలకి సైంటిఫిక్‌గా సమాధానాలు చెప్పాలి — అవి సైకాలజీ పుస్తకాలు చదివి చెప్పినంత తేలిక కాదని!

రవి పుస్తకాలన్నీ నీట్‌గా సర్దేసి — పొందిగ్గా అల్మారాలో పెట్టాడు. అంతా వాళ్ళ నాన్నని అనుకరిస్తాడు.

డెలిబరేట్‌గా ఇమిటేట్ చేస్తాడు.

తను పరిచేయబోతే ఆయన నవ్వి అంటారు. 'వుండవోయ్. అనుకరణని మిం



చిన గొప్ప కళేరి లేదీ ప్రపంచంలో!!

తొందరగా అనుకరించగలవాళ్ళే తమకం టూ ఒక స్టయిల్ డెవలప్ చేసుకుంటారు.

నిజమే! రవి దేన్ని చూసినా ఇట్టే పట్టేస్తాడు—

ఒకసారి ట్రెయిన్‌లో నార్త్ ఇండియా టూర్ కెళ్ళొచ్చారు.

తర్వాతెప్పుడో — ఏరోప్లేన్ గురించి వాడికేదో చెప్పింది.

మామూలుగానే వాడికి డౌటొచ్చింది — 'ప్లెయిన్‌లో వెళ్ళేప్పుడు నెంబర్ వన్ వస్తే ఎట్లా?'

ఆ డౌట్‌కి చిరాకేసి చెప్పింది — 'అందులో బాత్రూమ్స్ వుంటాయ్'.

వాడి థింకింగ్ — ఇమాజినేషనూ ఎక్కడికెళ్ళిపోయాయంటే — 'అమ్మా! నానెట్లా వస్తుందో నాకు తెల్సిపోయింది. ఏం లేదు. ఏరో ప్లేన్‌లో వెళ్ళే వాళ్ళకి నెంబర్‌వ న్ వొస్తే మనకి వానొచ్చేస్తుంది'' చాలా హుషారుగా చెప్పాడు.

ఒక్కటేద్దామనిపించింది.

అంతలో వాడే అడిగాడు. 'అసలు ఏరోప్లేన్ ఎట్లా వచ్చిందీ?'

తను ఓపిగ్గా రైట్ సోదరుల గురించి చెప్పింది.

ఆరోజు వాడు దుంప తెంచాడు.

బల్బ్ దగ్గర్నుంచి బలపందాకా ఎవరు కనిపెట్టారూ — అని అడుగుతూనే వున్నా డు.

తిక్కరేగి చివరికి అడిగింది 'మరి నిన్నెవరు కనిపెట్టారా?!'

'అమ్మ — అంటే నువ్వే!' టకీమని చెప్పాడు.

రేఖకి పట్టరాని ఆనందమేసి, వాడ్ని ముద్దుపెట్టుకుంది — గట్టిగా—

'అవునోయ్ — పిల్లలకెపుడూ మాతృభాష బోధనా భాషగా కొంతకాలముండాలి.

అపుడయితే వాళ్ళదే భాషలో మాట్లాడి అదే భాషలో ఆలోచించి — అదే భాషలో సందేహాలడుగుతారు.

సొంత భాషలో ఎనలైజ్ చేసుకుంటారు వాళ్ళ భావాల్ని చక్కని ఎక్స్‌ప్రెస్ చెయ్యగల్గుతారు.

అట్లా కాకుండా ఇంకో భాషయితే వాళ్ళు సరిగ్గా నోరు కూడా విప్పలేరు. భాషరాక భావాల్ని స్ప్రెస్ చేసుకుంటారు.

య్యా — య్యా — అంటూ అన్నిటికీ గంగిరెద్దుల్లా తలూపుతారు —' అనే భర్త మాటలు నిజమేనేమో అన్పించిందప్పుడు.

కడుపుమీద చిన్నారి పెదాల స్పర్శతో కళ్ళు విప్పింది — ''ఏమిటిదీ?'' అంటూ!

''తమ్ముడికి ముద్దు —''

''అచ్చం అబ్బ అలవాట్లే'' మనస్సులో విసుక్కుంది.

'అవునోయ్ — ఇప్పటిదాకా ఈ ఇంట్లో వీడే యువరాజు! అలాటిది రేపు ఇంకో బాబొస్తే — వీడు తన ఇంపార్టెన్స్ తగ్గినట్టు గా — వాడు తనకి పోటీ అన్నట్టుగా ఫీలవ్వకూడదు.

వీడు మనస్ఫూర్తిగా చిన్నాడ్ని ఇన్వయిట్ చెయ్యాలీ అంటే మనం వీడికిప్పట్నుంచే పెద్దరికమిచ్చి — ఆ కాన్సెప్ట్‌ని అలవాటు

చెయ్యాలి —' అంటూ చెప్పిన భర్త మాటలు గుర్తొచ్చాయ్.

"ఇది అమ్మకి — ప్చ్!" ఆమెని ముద్దుపెట్టుకున్నాడు.

రేఖ నవ్వి — కొడుకుని దగ్గర తీసుకుంది

"అమ్మా! మనమివ్వాల పార్క్‌కి వెళ్ళద్దా?" ముద్దుపెట్టుకున్న తల్లిని మారాంగా అడిగాడు.

ఆమె కాదన్లేకపోయింది.

ఇంటికి తాళం వేసి బయల్దేరింది — వాడ్ని తీసుకుని.

ఆమె ఎడమ చేతి చిటికెన వ్రేలుని పట్టుకుని నడుస్తూ రవి ఏవో కబుర్లు చెబ్తోన్నాడు.

ఆమె వూ కొడ్తోంది.

వున్నట్టుండి రవి ఆమె చేతిని వదిలేసి రెండు చేతుల్తో కళ్ళు మూసుకుంటూ చెప్పాడు.

"అమ్మా! అటు చూడొద్దు"

పరధ్యానంగా నడుస్తోన్న రేఖ చటుక్కున తల తిప్పింది.

'యాంకీ డూడిల్'

అయిస్‌క్రీమ్ కావాలని వాడు గుర్తుచేస్తోన్న విధానం ఆమెకి నవ్వు తెప్పించింది.

"వొద్దమ్మా! అటు చూస్తే మనకు అయిస్‌క్రీమ్ తినబుద్దేస్తుంది కదా —" ఇంకా కళ్ళుమీంచి చేతులు తీయలేదు.

ఆమె పూర్తిగా కరిగిపోయింది.


"వేషాలేస్తున్నావ్ —" నవ్వి — వాడ్ని పార్లర్‌లోకి తీసుకెళ్ళి అయిస్‌క్రీమ్ కొనిపెట్టింది.

చిన్నారి చేతుల్తో ఆ అయిస్‌క్రీమ్ క్రాన్‌ని అపురూపంగా పట్టుకుని — వాడు తింటోన్న విధానం — వాడి సంతోషం చూస్తుంటే —

అయిస్‌క్రీమ్ ఎక్కువగా తింటం ఆరోగ్యానికి మంచిదికాదని చెప్పిన మెడికల్ సైన్స్‌ని తగలేయాలన్పిస్తోంది.

కొద్దిదూరం వెళ్ళాక — రోడ్డుకి అటు పక్కన జామకాయల బండి కన్పించింది... చాలా టెంప్టింగ్‌గా!

రోడ్డు క్రాస్ చేయటం ఇబ్బందవుతుందని రవిని అడిగింది. "రవీ! ఎత్తుకుంటా



ను రామ్మా!''

వొంగిన రేఖతో "వొద్దమ్మా! తమ్ముడ్నీ నన్నూ ఒక్కసారే ఎట్లా ఎత్తుకుంటావ్?

నేను పెద్దాడ్ని కదా —నేను నడుస్తాను. ఎపుడో చెప్పిన మాటల్ని గుర్తు పెట్టుకుని చెప్పాడు పెద్ద ఆరిందలా!

వాడు మీద పడకుండా జాగ్రత్తగా అయిస్క్రీమ్ తింటోన్న తీరు ముచ్చటేసింది — ముద్దొచ్చింది.

ఆమె వాడ్ని ముద్దు పెట్టుకుంటుంటే — "అబ్బబ్బ — వుండమ్మా — " విసుక్కున్నాడు.

ఆమె వాడి చిటికెనవ్రేలు పట్టుకుని రోడ్డు క్రాస్ చేయించింది.

ఎందుకో ఆమెకు జనం ఎక్కువగా వున్నట్టు — హడావిడిగా వస్తోన్నట్టు అన్పించింది.

ఏదయినా సినిమా వదిలేరా? అంటే ఆరయిపోయింది — ఇపుడేం సినిమా వదుల్తారు?

శీతాకాలం — తొందరగా చీకటిపడ్తోంది — అందుకేనేమో జనంలో కంగారు!

ఎంతయినా సిటీలో ట్రాఫిక్ పెరిగిపోయింది — అనుకుందామె.

"ఎట్లా? " జామకాయలమీద చెయ్యేస్తూ అడిగింది.

"ఫోర్ రూపీస్—" ఆ చెప్పిన తీరుకి ఆమె అతని ముఖంలోకి చూసింది. ఎత్తుగా, నల్లగా, లావుగా వున్నాడు.

ముఖంలో కరుడుగట్టిన కఠినత్వం — ఏ భావమూ తెలీట్లేదు.

వేసుకున్న లాల్చీ, పైజమా కొద్దిగా మాసినట్టువ్నాయ్ . వాటికి తోడు పెరిగిన గడ్డం.

బేరమడగబోయి కూడా — ఎందుకొచ్చిన గొడవ — రూపాయిలో పోయేదేమీలేదు — అనుకుని కాయలేరి చెప్పింది — "కిలో!''

అతను తూసాడు.

పర్సులో డబ్బులు తీస్తుండగా ఆమెకి రోడ్డుమీద ట్రాఫిక్‌లో ఏదో అసహజత్వం కన్పించింది.

ఒక రష్ — ఒక హడావిడీ — ఒక ఆందోళనా — అకస్మాత్తుగా మొదలైనట్టన్పించింది.

ఆమెకేమీ అర్ధం కాలేదు.

దూరంనుంచి ఏవో అరుపుల్లా విన్పిస్తోన్నాయ్!

అతను రేఖ ఇచ్చిన డబ్బుల్ని గోనెపట్టా క్రిందవేసి చాకుని చేతిలోకి తీసుకున్నాడు.

ధగ ధగా మెరుస్తోన్న ఆ చాకు జామకాయల్ని కోయటానికా? గొంతులు కోయటానికా — అన్న భావం కలిగిందామెకి—

కొద్దిగా కంగారుగా, గాభరాగా చెప్పింది — "ఆహా వొద్దొద్దు — కోయద్దు—''

అతను నిర్వికారంగా జామకాయల్ని పేపర్‌బేగ్‌లో వేసి — రేఖవైపుకి జరిపాడు.

రేఖ వాటిని అందుకోబోయింది.

సరిగ్గా అప్పుడు మొదలయ్యింది గొడవ.

గోల గోలగా అరుపులు! అరుపులకన్నా ఆవేశం ఎక్కువ అవ్వటంవల్ల కాబోలు — అరుపులేమిటో సరిగ్గా విన్పించట్లేదు.

రేఖ తల తిప్పింది — వులిక్కిపాటుగా!

ఆగిన బస్సుమీద — రాళ్ళవర్షం పడుతోంది.

జనం! ఎటు చూసినా జనం! జనం!

పెల్లుబికిన జనం!

ఎక్కడ్నుంచి వచ్చారో — ఎందుకొచ్చారో ఆవేశానికి ప్రతిబింబాల్లా వున్నారు.

ప్రతి ఒక్కళ్ళ చేతుల్లోనూ ఏదో ఒక ఆయుధముంది — కర్రో — సైకిల్ ఛెయినో—

చెలియలి కట్ట దాటిన సముద్రంలా పొంగుకొస్తున్నారు.

రేఖకేమీ అర్థం కాలేదు.

రవి పిల్లి కూనయిపోయేడు — తల్లి చీర కుచ్చిళ్ళని పట్టుకుని అడిగాడు "అమ్మా! వాళ్ళెవరూ?"

ఏమని చెబ్తుంది? రవి ఏడ్పు మొదలెట్టేసాడు.

జరగబోయే వుపద్రవాన్ని చూస్తోంటే — వొణుకుతున్న చేతుల్తో రవిని దగ్గరికి తీసుకుంది.

షాపుల్లో అద్దాల్ని నిర్దాక్షిణ్యంగా పగలగొడ్తున్నారు.

వారించబోయిన వాళ్ళని లెక్కచెయ్యట్లేదు.

అరుపులు — ఏడ్పులు — అర్థింపులు — కేకలు — శబ్దాలు!

షట్టర్లు దించేస్తున్నారు.

వచ్చిన వాళ్ళు మనుషుల్లా లేరు — పిచ్చి ఆవేశంతో ప్రపంచాన్నంతా నాశనం చేయబోయే వున్మాదుల్లా వున్నారు.

వైన్ షాపుల్లోని బాటిల్స్‌ని రోడ్డుమీదికి అడ్డదిడ్డంగా విసిరేస్తున్నారు.

ఒక ప్రక్కనుంచి పళ్ళబళ్ళని అపహరంగా నే ఎత్తేస్తోన్నారు.

వాళ్ళందరిలో కసి — పట్టుదలా!

దౌర్జన్యం — మితిమీరింది.

క్రనెప్పపాటులోనే ఇంత భీభత్సవూ జరిగిపోయింది — నమ్మశక్యం కాకుండా!

దూరంగా ఎక్కడో పోలీస్ జీప్ తాలూ



కు సైరన్ విప్పించింది. జనం ఇంకా పేృ ఓగిపోయారు.

రేఖ గభాల్న వెనకా ముందూ చూడకుండా బాబుని ఒక్కసారిగా ఎత్తుకుని గుండెలకి అదుముకుంది.

ఏదో ఇన్‌స్టింక్ట్ — పరిగెత్తాలి!

వివాదాలు — హాహాకారాలు — పెడబొబ్బలు — గాల్లోకి లేస్తోన్న లాఠీలు—

పోలీసుల హెచ్చరికలు—

క్షణం విలువ కూడా ప్రాణమంత గొప్పది.

రోడ్డునిండా అద్దముక్కలు — గాజు ముక్కలు — నెట్టుకుంటూ తోసుకుంటూ పరిగెత్తుతోన్న జనం!

పైనుంచి రేఖ నిండు గర్భిణి — అయినా తాత్సారం చేయలేదు.

నిలబడి వూపిరి పీల్చటానిక్కూడా వీల్లేదు.

ఎటు వెళ్ళాలో తెలీదు.

వెనక జనం తరుముకొస్తున్నారు. రొప్పుతూనే పరిగెత్తుతోంది.

కకావికలవుతున్న జనం!

రవి ఏడ్పు తారాస్థాయినందుకుంది — వాడి చేతిలో అయిస్ క్రీం ఎప్పుడోనే పడిపోయింది. వాడు బెంబేలెత్తిపోతున్నాడు.

రేఖ వాడి వీపుమీద చెయ్యేసి — పరిగెత్తుతోంది.

ఎవరో — ఎవరో — ఆ గలాటాలో రేఖ మెడమీద చెయ్యేసారు. బలంగా గొలుసు లాగారు.

రేఖ కెవ్వున కేకేసింది.

స్వార్థం ఎంత భయంకరంగా వుంటుందీ ఇలాటి పరిస్థితుల్లో కూడా ఎక్స్‌ప్లాయిటేషన్ చేసే ప్రవృత్తిని ఏమనాలి?

అసలు నిజంగా వీళ్ళకి కావల్సిందేమిటి?

వీళ్ళు సాధిస్తున్నదేమిటి?

అవకాశం దొరికితే మనిషి ఒక్కడేనా ఇంతగా దిగజారిపోయే జంతువు?

సాటి మనిషిని బ్రతికుండగానే నిలువునా పీక్కు తినేంతటి రాక్షసత్వం మనుషుల్లోనే వుంటుందా?

ఆలోచించి — ఓట్లువేసి — జాగ్రత్తగా ఎన్నుకున్న ప్రజానాయకులేమైపోయారు?

ప్రభుత్వమేమయ్యింది? ఏరీ రక్షకభటులు?

రేఖకి చీరకుచ్చిళ్ళు అడ్డంపడ్డాయ్—

కంగారులో పడిపోబోయింది.

అయినా నిల్రదొక్కుకుంది.

నిజంగా ఆ క్షణంలో పడిపోవటమంటూ జరిగితే — జరిగితే — ఆమె మీదనుంచే ఈ జనమంతా తొక్కుకుంటూ వెళ్ళిపోతారు.

ఎవరి ప్రాణమానాలకోసం వాళ్ళు పరిగెత్తుతున్నారు.

చేతిలో బాబునీ — తననీ రక్షించుకోవాలన్న పట్టుదలతో రేఖ పరిగెత్తుతోంది.

ఎడమ ప్రక్కన జాముకాయలతను కన్పించాడు — ఒక్కసారి చూస్తే చాలు జన్మలో మరుపురాని ముఖం!

చేతిలో చాకుతో ఆపళంగానే వచ్చేసినట్టున్నాడు.

అతడికి దూరంగా పరిగెత్తాలన్న భయంతో చేతితో చీర కుచ్చిళ్ళు పట్టుకుని పరిగెత్తుతుండగా జరిగిందది—

ఆమె భుజమ్మీది బాబుని ఎవరో లాగారు.

ఆ ఆలోచనతోటే ఆమె బెదిరిపోయింది

వెర్రికేక వేసింది.

వినిపించుకునే వారెవ్వరు?

ఆమె గ్రహించేలోపుగానే బాబుని ఒడుపుగా లాగేసారు.

"వొద్దూ —" ప్రక్కకు తిరిగి చూసిన ఆమెకి నోట మాట కూడా రాలేదు.

గుండె ఆగిపోయినంత పనయ్యింది.

ఇందాకటి జామకాయలతను — చేతిలో కత్తి!

'అయ్యో! ఈ దుర్మార్గుడికి తన బాబే దొరికాడా?

ఇప్పుడు వీడు బాబునేం చేస్తాడు?' ఆ ఆలోచన్తో ఆమెకి వూపిరాడలేదు.

"ఏయ్! నా బాబుని నాకిచ్చేయ్ —" అరిచింది.

అతను వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తుతున్నాడు.

భయంతో, బాధతో, దుఃఖంతో అతని వెనక ఆమె! చేజేతులా బాబుని వాడికప్పగించిన బాధ!

ఒట్టిమనిషి కూడా కాదేమో — ఈ టెన్షన్‌కీ, భయానికీ — మనిషి వొణుకుతోంది.

చెమటలు కారిపోతున్నాయ్!

కాళ్ళు తడబడ్తున్నాయ్!

ఆమెకు ప్రార్థిద్దామన్నా దేవుడు గుర్తురాలేదు.

మతం గుర్తొచ్చింది.

వొద్దొద్దు — ఏ మతమూ వద్దు!

మసీదు వద్దు! ఆలయమూ వద్దు!

మనిషిని మనిషిగా బ్రతకనివ్వని ఏ మతమూ వొద్దు—

రవి ఏడుస్తో, పిలుస్తున్నాడు — "అమ్మా! అమ్మా!"

ఆమె వెనకబడిపోయింది.

అతను పదడుగుల ముందరున్నాడు.

అతనితో సమానంగా పరిగెత్తాలన్నా పరిగెత్తలేకపోతోంది.



వేషం

నిర్మాత హీరోతో మొత్తుకుంటున్నాడు.

"ఇదేంటయ్యా బాబూ. హీరో వేషం వెయ్యమంటే విలన్‌గా వేస్తానంటావేం?"

"స్టోరీలో రేప్‌సీన్లు ఎక్కువగా వున్నాయటకదండీ..."

—ప్రసాద్ (హిందూపూర్)

పైట జారిపోయింది — చూసుకోలేదు.

చెప్పు పడిపోయింది — పట్టించుకోలేదు

పరిగెత్తుతూనే వుంది. అరుస్తోంది — అర్థిస్తోంది.

"నా బాబుని నాకిచ్చేయ్ —

నీకు దండం పెడ్తాను — వాడ్నేం చేయకూ —" చేతులు జూస్తూ పరుగెత్తుతోంది.

ఆమెకు వ్నుహాతప్పేలా వుంది.

శరీరం స్వాధీనం తప్పుతోంది.

కళ్ళు బైర్లు కమ్ముతున్నాయ్.

అంతా మసకగా వుంది.

చుట్టూ అంత మందున్నా ఎవరూ కన్పించట్లేదు.

ఏ గొడవా విన్పించట్లేదు.

ఎదురుగా బాబునెత్తుకుని పరిగెత్తుతోన్న అతనొక్కడే కన్పిస్తున్నాడు.

క్షణం — సరిగ్గా క్షణం పేపే పట్టుతప్పింది.

అంతే! ఆమె బోర్లా పడిపోయింది "రవీ!" అంటూ—

ఆ క్షణంలో ఆమె తనకదే ఆఖరిక్షణమనీ, తను చచ్చిపోతున్నాననీ అనుకుంది.

బ్రతుకు మీది ఆశని చంపుకోబోతున్న ఆ క్షణంలో అతను వెనక్కి తిరిగి రావడం ఆమెకు కన్పించింది.

పజిల్ట్గా చూసింది.

రవిని దింపి — వొంగాడు.

తన మెడ చుట్టూరా చేతులు వేసి తననీపుమీద కూర్చోమని సైగల్తో రవికి చెప్పాడు.

ఎక్కువ ఆలస్యం చేయలేదు.

రేఖని వెల్లకిలా తిప్పి — ఆమె మెడక్రింద — మోకాళ్ళక్రింద చేతులు వేసి — అమాంతంగా పైకి లేపేసాడు.

వీపుమీద రవినీ — చేతుల్లో రేఖనీ మోస్తూ పరిగెత్తసాగాడు.

ఈ దుర్మార్గుడు తమని ఎక్కడికీ ఎత్తుకుపోతున్నాడు? ఏం చేస్తాడూ?

వెనక మతోన్మాదులు వెంటాడ్తున్నారు.

తనూ — బాబూ ఇతని చేతుల్లో...

ఇతనిదేమతం?

తెల్సిన జవాబు... మదిలో మెదుల్తోంటే భయంతో ఆమె కనుపాపలు పెద్దవయ్యాయ్.

ముఖం తెల్లగా పాలిపోయింది.

రక్తాన్ని గడ్డ కట్టించే జవాబు!

చావైనా, బ్రతుకైనా వీడి చేతుల్లోనేనా?

"నో —" అతడ్ని తోసివేయబోయింది — విరోధించబోయింది — అన్ని విఫల ప్రయత్నాలు చేసింది.

లాభం లేకపోయింది.

అతను బలిష్ఠుడు పైగా వుడు పట్టు!

సడెన్గా మొదలయ్యింది ... నడుములో మంచి నొప్పి — బలంగా!

వెంటనే అదేమిటో ఆమెకి అర్థమయ్యింది.

ఆమె అప్పటికే బిడ్డతల్లి!

ఇక ఆమె అవస్థ వర్ణనాతీతం!

ప్రాణం తీసేంతగా నొప్పులు అంతకం

తకీ అధికమవుతున్నాయ్!

మొదటిసారి నొప్పులొచ్చిన లైఫ్‌లో భర్త వొళ్ళో — వెన్నెట్లో — తల పెట్టుకుని పడుకునుంటం గుర్తొచ్చింది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్!

నొప్పుల్తో విలవిల్లాడిపోతోంది.

అతను గ్రహించినట్టున్నాడు.

గబగబ ప్రక్కనున్న ఓపెన్ స్పేస్‌లోకి దారి తీశాడు.

జన సంచారం లేదు. అక్కడక్కడా చెట్లున్నాయ్.

అప్పటిదాకా పగలంతా సీతాఫలం బళ్ళు అక్కడుండి వెళ్ళిపోయినట్టున్నాయ్.

అక్కడ గుర్తుగా ఎండిన కొమ్మలున్నాయ్.

అతనప్పటికే ఏం చేయాలో ఆలోచించేసుకుని వున్నట్టున్నాడు.

బాబుని దించాడు.

జాగ్రత్తగా ఆమెని చెట్టు మొదలుకి ఆనించి కూర్చోబెట్టాడు.

ఎండిన కొమ్మల్ని పక్కలా పరిచి — ఆమె వారిస్తున్నా వినకుండా ఆమెని తీసుకొచ్చి దానిమీద పడుకోబెట్టాడు.

ఎండిన కొమ్మలు గుచ్చుకున్నాయ్.

పంటి బిగువునా నొప్పుల్నీ, బాధనీ భరిస్తోంది.

ప్రశాంతమైన వాతావరణంలో ప్రసివిస్తే — శాంత మనస్కులైన పిల్లలు పుడ్తారట!

మరిప్పుడు?

ఆమె ఆలోచించలేకపోతోంది.

కడుపుమీద చేతులేసి బలంగా అదుముకుంది.

అతను కాళ్ళవైపుకి వెళ్ళాడు.

అతని వుద్దేశ్యం అర్థమైన ఆమె సిగ్గుతో చితికి పోయింది — తల్లి సమక్షంలోనో, మరో స్త్రీ సమక్షంలోనో జరగాల్సిన ప్రసవం — ఇతని ముందర జరగబోతుందా?

వీల్లేదు — వీల్లేదు.

అలాగని బిగబట్టుకున్నా భరించలేని బాధ!

కంపరం కల్గిస్తూ — ఎదురుగా అతను!

ఆమెకి కొద్ది కొద్దిగా తెలుస్తోంది — ఏం



అందుకు

సంగీతరావ్‌తో ఆశ్చర్యంగా—

"మొన్న కచేరీలో— అంతసేపు ఆగకుండా ఆలాపనెలా చేశారు?"

"నా పాంట్‌లో తేలున్న సంగతి చెప్పలేక..."

—సూర్యశ్రీ (హిందూపురం)

జరుగుతోందో —

'చిన్నారి కన్నా—

రామ్మా! ఈ విశాల ప్రపంచానికి...

నీకు వెల్కం చెబుతున్నా...

ధవళ వస్త్రాన్ని పరిచి...'

అబ్బా! ఈ మూఢుడికి తన బాధ అర్థం కావట్లేదేం? ఏళ్లొచ్చాయ్! ఏమీ తెలీదే —' అవతలికి వెళ్ళడే?

''వెళ్ళిపో... నువ్విక్కడ్నుంచి వెళ్ళిపో..' ఒక్కసారిగా హిస్టీరిక్‌గా అరిచేసింది.

అతను కదల్లేదు.

సామనయంగా ఆమె కాళ్ళదగ్గర కూర్చుని అరచేతుల్తో పాదాలు రాయసాగేడు.

నిజం చెప్పాలంటే—

ఆమెకే గాదు — అతనికీ బిడియంగానే వుంది — అలాటి పరిస్థితిలో వుండాల్సి వచ్చినందుకు.

ఆ సంగతి ఆ క్షణంలో ఆమెకర్థమయ్యింది.

ఆ క్షణంలో — ఆ ప్రాంతం —

జెరూసలెంలోని పశువుల పాకయ్యిందో —

మధురలోని కారాగారమయ్యిందో— చెప్పటం కష్టం! — మానవత్వం పునర్జన్మించింది.

అతను చాకుతో బొడ్డు కోయటానికి వంగాడు.

ఆమెకి స్పృహ తప్పింది — తప్పబోతోన్న చివరి క్షణంలో ఎక్కడ్నుంచో దూరంగా —

ఆలయ గోపురమూ — మసీదుపైని టూంబ్ — ప్రక్కప్రక్కనే మసగ్గా కన్పించాయ్.

* * *

రేఖ స్వెట్టర్ అల్లుతోంది.

రవి కూర్చుని చదువుతున్నాడు.

'మహమ్మదీయుల పుణ్యస్థలం...'

చేస్తోన్న పనిని ఒక్కసారిగా ఆపేసి, రవివైపు చూసింది — పిల్లల్ని ఎంతో ఆదర్శవంతంగా పెంచాలని — ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకున్నారు—

అంతా షీర్ వేస్ట్ — గొప్ప పొరపాటు జరిగిపోయింది.

మతాల గురించీ — దేవుళ్ళ గురించీ — ఇంత చిన్నప్పట్నుంచి వాళ్ళ మెదడుని పొల్యూట్ చేస్తోన్నాయ్ పుస్తకాలు!

వాళ్ళ చిన్నారి మనస్సుల్నిండా విషం నింపుతున్నాయ్!

మత ప్రసక్తిలేని భావితరాల్ని అలౌకిక రాజ్యాన్ని — నిర్మించాలంటే — తను చేయాల్సిందొక్కటే!

రవి చేతిలోని పుస్తకం తీసుకుంది.

వాడు తెల్లబోయి చూస్తున్నాడు.

ఇక్కడ్నుంచి మొదలెట్టాలి — ఆమె పుస్తకం చింపటం మొదలుపెట్టింది...

